భారతీయ చిత్రలేఖనం.. సింధు నాగరికత!

ప్రపంచంలో అతి ప్రాచీనమైన నాగరికతలు నాలుగు. అవి.. చైనా, ఈజిప్టు, సుమేరు, హరప్పా-సింధు నాగరికతలు. భారతదేశంలో సింధు నాగరికత క్రీ.పూ. 2300 నుంచి క్రీ.పూ.1750 వరకూ అభివృద్ధి చెందింది. హరప్పా-మొహంజొదారోలు రెండు ప్రాచీన పట్టణాలు. అవి ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నాయి. హరప్పా-సింధు నాగరికత రాజస్థాన్, పంజాబ్, గుజరాత్ ప్రాంతాల వరకు విస్తరించింది. ఈ నాగరికతలో శిల్పాలు, ముద్రలు ఎక్కువగా లభించాయి. మట్టిపాత్రలు, కుండపెంకులపై జంతువులు, పక్షుల బొమ్మలు చిత్రించారు. దీనిని బట్టి ఆ కాలంలో చిత్రకళ కూడా ఉండేదని తెలుస్తోంది!!

ఉత్తర భారతదేశంలో మౌర్యుల కాలంలో బౌద్ధమతం విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. శిల్పం-చిత్ర లేఖనాలను వీరు పోషించారు. బుద్ధుడి పూర్వజన్మ కథలుగా పేర్కొనే బౌద్ధ జాతక కథలను స్తూపాలు, తోరణాలపై చిత్రించారు. మౌర్యుల సంప్రదాయాలను శాతవాహనులు అనుసరించారు. శాతవాహనులు క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి, క్రీ.శ. 2వ శతాబ్దం వరకు పశ్చిమాంధ్ర(దక్కన్) దేశాలను పాలించారు. నాసిక్, బెడ్సా, కార్లా, కొండేన్, భాజా వంటి కొండ గుహలలో ఆనాటి శిల్ప-చిత్రలేఖనాలు కన్పిస్తాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అజంతా గుహలు 29 వరకూ ఉన్నాయి. అందులో క్రీ.పూ. 2వ శతాబ్దంలో ఆంధ్ర శాతవాహన రాజులు... 9, 10 గుహలలో భిక్షువులు బోధి వృక్షాన్ని ఆరాధించే చిత్రాలు చిత్రించారు. అజంతా చిత్రాలను గుహల గోడలపై, గుహల లోకప్పులపై చిత్రించారు. ఇక్కడ బుద్ధుడి పూర్వజన్మను తెలిపే 'బౌద్ధ జాతక' కథలనే చిత్రించారు. రాజులు, రాణులు, భటులు, దాసీలు-ప్రజలు-జంతువులు, ఊరేగింపులు, భవనాలు లాంటి లౌకిక ఇతివృత్తాలను అతి సహజంగా చిత్రించారు. ఈ చిత్రాలలో రంగుల వైవిధ్యం తక్కువే అయినా... సన్నని రేఖా చిత్రాలు అలంకృత డిజైన్లు, అందంగా చిత్రించారు. క్రీ.పూ.2వ శతాబ్దం నుంచి క్రీ.శ. 7,8వ శతాబ్దాల వరకు మనకు అజంతా గుహలలో శాతవాహన, వాకాటక, గుప్త, బాదామి, పశ్చిమ చాళుక్యుల చిత్రలేఖనాలు కనిపిస్తాయి.

ఈ చిత్రాలను మనం హీనయాన-మహాయాన చిత్రలేఖనాలుగా విభజించవచ్చు. శాతవాహన రాజుల కాలంలోని కథా వస్తువు హీనయాన బౌద్ధం. వాకాటక, గుప్త, బాదామి,పశ్చిమ-చాళుక్యుల చిత్ర లేఖనాల కథా వస్తువు మహాయాన బౌద్ధం. అజంతా చిత్రాలలో



అంచులు ఉండవు. దృశ్యానికి-దృశ్యానికి మధ్య చెట్లు, పొదలు, వాస్తు సంపదలతో వేరు చేస్తారు. అజంతాలోని గుహలు 1 నుంచి 5 వరకు బాదామి చాళుక్యుల కాలం నాటివి. 19, 26, 29 గుహలు గుప్తుల కాలం నాటివి. అజంతా తర్వాత ఎల్లోరా గుహలలో చిత్ర లేఖనాలున్నాయి. శైలి అజంతాను పోలి ఉంటుంది, కాని కథా వస్తువు హిందువులది. నటరాజు, శివుడు, పార్వతి, నందీశ్వరుడు వంటి చిత్రాలు కనిపిస్తాయి. శివుడ్ని పూజించడానికి ఇంద్రుడు భూమికి దిగి వస్తున్నటున్న చిత్రాలు.. ఎల్లోరాలోని కైలాసనాథ దేవాలయ మండపం లోకప్పు భాగంలో చిత్రించారు. ఈ చిత్రాలు రాష్ట్రకూటుల కాలం నాటివి.

భాగ్ చిత్ర లేఖనం :

మాల్వా ప్రాంతంలోని భాగ్ గుహలలోని చిత్రాలను అజంతా రీతి (శైలి)లోనే చిత్రించారు. చిత్రాల పొందిక, అలంకరణ దృశ్యాలు, రేఖా చిత్రాలు అన్నీ అజంతా చిత్ర లేఖనాన్ని పోలి ఉంటాయి. అజంతా, భాగ్‌లలోని చిత్ర లేఖనాలు భారతీయ చిత్ర సంప్రదాయాన్ని అనుసరించే చిత్రించారు. ఇక్కడ గ్రీకుల సంప్రదాయం లేదు. క్రీ.శ. 1, క్రీ.శ 3 శతాబ్దాల మధ్య కాలంలో కుషానులు ఉత్తర భారతదేశాన్ని పాలించారు. వీరి పాలనలో కళలకు మధుర ప్రధాన కేంద్రం. ఆఫ్గానిస్థాన్‌ను దాటి, మధ్య ఆసియాలోకి బౌద్ధమతంతోపాటు భారతీయ కళలు విస్తరించాయి. అనేక భారతీయ దృశ్యాలు మధ్య ఆసియా చిత్ర లేఖనంలో చోటు చేసుకున్నాయి. మూడు ముఖాలు కలిగిన శివుడి చిత్రం, బలావస్తలో లభించిన బుద్ధుడి చిత్రాలు క్రీ.శ. 3వ శతాబ్దం నాటివి. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలు ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో ఉన్నాయి.

గుప్తులకాలం:

క్రీ.శ. 4 నుంచి 6వ శతాబ్దం వరకు ఉత్తర భారతదేశాన్ని పాలించిన గుప్తుల కాలాన్ని విశిష్ట యుగంగా చరిత్రకారులు పేర్కొంటారు. వింధ్య పర్వతాలలో 'బాఘ్ గ్రామం' వద్ద లభించిన కొండ గుహలలోని చిత్ర లేఖనాలు గుప్తుల కాలం నాటి వాటికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బాఘ్ గుహలు పూర్వం గ్వాలియర్ రాష్ట్రంలో ఉండేవి. ఇక్కడ 9 గుహలు న్నాయి. అందులో గుహ రెండు, నాలుగు, అయిదు ముఖ్యమైనవి. బాఘ్ గుహలలోని చిత్రాలను నందలాల్ బోస్, అసిత్

కుమార్ హల్దార్ వంటి ఆధునిక చిత్రకారులు నమూనాలు చిత్రించారు. ఆ చిత్రాలు ప్రస్తుతం గ్వాలియర్ మ్యూజియంలో ఉన్నాయి. బాఘ్ గుహలలో చిత్రాలను గోడలు, స్తంభాలపై పక్షులు, జంతువులు, బుద్ధుడి జాతక కథలు, బౌద్ధ భిక్షువులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు చిత్రకారులు.

పశ్చిమ చాళుక్యులు :

పశ్చిమ చాళుక్యులు క్రీ.శ. 6వ శతాబ్దం నుంచి క్రీ.శ. 8వ శతాబ్దం వరకు దక్కను ప్రాంతాన్ని పాలించారు. దక్కనులో వాకాటక రాజుల తర్వాత పాలన చేశారు. ఈ రాజులలో మొదటి పులకేశి, కీర్తివర్మ, రెండవ పులకేశిన్, మంగళేశుడు తదితరులంతా గొప్ప కళా పోషణ చేశారు. పశ్చిమ చాళుక్యుల కాలంలో మొదట హిందూ దేవతల చిత్రాలు గుహలలో చిత్రించారు. అందులో వైష్ణవ గుహ ముఖ్యమైంది. ఇక్కడ త్రివిక్రముడు, నరసింహ, విరాట్, చాళుక్యుల లాంఛనమైన వరాహాన్ని శిల్పాలలో చూపించారు.

పశ్చిమ చాళుక్య రాజైన మంగళేశుడు అజంతా చిత్ర సంప్రదాయాలను బాదామి గుహలలో పాటించారు. దక్కనులో మొట్టమొదట హిందూ దేవతల చిత్ర లేఖనాలు ఈ వైష్ణవ గుహలలో కనిపిస్తాయి. ఈ గుహలలో ఒక ఫలకంపై సంగీతకారులు, నాట్యకత్తెలు- వివిధ వాయిద్యాలతోచిత్రించారు. ఒరిస్సాలోని కళింగ రాజు విసాభాంజా కాలంలో.. సీతాభంజి వద్ద క్రీ.శ. 8వ శతాబ్దానికి చెందిన భాంజ వంశస్తుల పాలనను చిత్రించిన చిత్రాలలో రామాయణంలోని సీతా, లవకుశలు, రావణుడి చిత్రాలను చిత్రించారు. ఒరిస్సా రాష్ట్రంలో మొట్ట మొదటి చిత్ర లేఖనంగా సీతాభంజి చిత్రాలను పేర్కొంటారు.

మహేంద్రవర్మ చిత్రకారుడు:

క్రీ.శ. 7 నుంచి క్రీ.శ. 9 శతాబ్దాలలో దక్షిణాదిలో పాలించిన పల్లవ రాజులలో మహేంద్రవర్మ స్వయంగా వాస్తు శిల్పి, చిత్రకారుడు. ఇతని కాలంలోని మామండూర్ గుహాలయాలలో చిత్రలేఖనాలున్నాయి. పల్లవుల కాలం నాటి పానమాలై, కాంచీపురం దేవాలయాల్లో అక్కడక్కడా కనిపిస్తాయి. ఈ దేవాలయాలు మహేంద్రవర్మ తర్వాత కాలంలో నిర్మించారు. ఈ దేవాలయ చిత్రాలలో సోమస్కంధుడు, శివ-పార్వతుల చిత్రాలున్నాయి. మండగపట్టు, పణమలై, కాంచీపురం.. పల్లవ చిత్ర లేఖనాలకు ప్రసిద్ధి పొందాయి. పల్లవుల కాలంనాటి గుహాలయాల వంటివే పాండ్యుల గుహాలయాలు. తొలి పాండ్య రాజులు (క్రీ.శ. 7 నుంచి 9 శతాబ్దం వరకు) దక్షిణ భారతదేశంలో తొలి పల్లవులు శిల్ప-చిత్ర సంప్రదాయాలను పాటించారు. వీరి కాలంలోని తిరుమలైపురం గుహాలయంలో కొన్ని చిత్ర లేఖనాలను ప్రొఫెసర్ దూబ్రియల్ కనుగొన్నాడు. కొన్ని చిత్రాలు పాడైపోయాయి. ఈ గుహాలయంలో హంసలు, బాతులు, పద్మాలు లోకప్పు, స్తంభాలుపై చిత్రించారు. ఇదే కాలంలో పాండ్య రాజుల పాలనలోని చిత్రలేఖనాలు తిరుమలైపురంలోని సిత్తన్నవాసల్ గుహాలయాలలో చూడవచ్చు. తిరునందిక్కరై గుహాలయంలో చేర రాజుల చిత్రకళను చూడొచ్చు. ఎల్లోరా గుహలలోని కైలాసనాథ ఆలయంలో రాష్ట్రకూటుల కాలం నాటి చిత్రాలున్నాయి. అవి క్రీ.శ.10వ శతాబ్దం నాటివి. చోళ సామ్రాజ్య చిత్రలేఖనాలు తంజావూరు బృహదీశ్వర ఆలయంలో కనిపిస్తాయి.

చోళ రాజులు కళా పోషకులు:

క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు పాలించిన చోళ రాజులలో... ఆదిత్య, పరాంతక, రాజరాజ చోళులు దక్షిణ ప్రాంతంలో గొప్ప కళా పోషణ చేశారు. చిదంబరంలోని శివ భక్తుడు పరాంతక చోళుడు. చిదంబరం దేవాలయానికి అనేక దానధర్మాలు చేశాడు. చోళ రాజుల కాలంలో ముఖ్యంగా రాజరాజ చోళుడు నిర్మించిన తంజావూరులోని బృహదీశ్వర ఆలయం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. తంజావూర్‌లోని బృహదీశ్వర ఆలయ గోడలపై చిత్రాలు చిత్రించారు. ఇది కాకుండా, 'నర్తమలై'లోని విజయాలయ చోళీశ్వరుని ఆలయం గోడలపై, ఉత్తర ఆర్కాటు జిల్లాలోని తిరుమలై వద్దనున్న గుహకు ముందు భాగం గోడపై చిత్రాలు కనిపిస్తాయి.

కాకతీయుల చిత్రలేఖనం :

కాకతీయులు (క్రీ.శ. 11వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు) పశ్చిమ చాళుక్యులకు సామంత రాజులు. తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. కళ్యాణీ చాళుక్యుల సంప్రదాయాలనే పాటించారు. కాకతీయులు శైవ భక్తులు. బహుళ ప్రచారంలో ఉన్న కాకతీయుల దేవాలయాలలో వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, పాలంపేట, హనుమకొండ, త్రిపురాంతకం, మాచెర్ల, ఘనాపూర్, పిల్లల మర్రి ముఖ్యమైనవి. త్రిపురాంతకం దుర్గా దేవాలయం, మాచెర్ల దేవాలయాలలో చిత్రలేఖ నాలున్నాయి. పిల్లల మర్రి దేవాలయంలో దేవతలు-రాక్షసులు 'అమృత మధనం' దృశ్యం గొప్పగా చిత్రించారు.

విజయనగర రాజుల చిత్రకళ:

విజయనగర సామ్రాజ్యం క్రీ.శ. 1336లో ఏర్పాటైంది. విజయనగర రాజులలో కళాపోషకుడు,రాజనీతిజ్ఞుడు, గొప్ప పాలనాదక్షుడు శ్రీకృష్ణ దేవరాయలు. విజయనగర రాజుల కాలంలోని దేవాలయ గోపురాలు, మండపాలు, ప్రవేశద్వారాలు, కళ్యాణ మండపాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, గొప్ప కళాత్మకమైన నిర్మాణాలు చేపట్టారు.

వీరి కాలంలోని లేపాక్షి వీరభద్రస్వామి కళా మండపం, కాంచీపురంలోని వరదరా జస్వామి, హంపీలోని విఠలాలయం, వెల్లూరులోని జలకంఠేశ్వర ఆలయాలు గొప్ప కట్టడాలుగా గుర్తించారు. తిరుపురుత్తి కున్‌రమ్, హంపీ, లేపాక్షి, ఆనెగొంది, సోమపాలెం, పిల్లల మర్రి దేవాలయాలలో సుందరమైన చిత్రలేఖనాలున్నాయి. 'తిరుప్పరుత్తికున్‌రం'లో జైన కుడ్య చిత్రాలున్నాయి. అందులో మహావీరుడు, పార్శ్వనాథుడి చిత్రాలు కనిపిస్తాయి. హంపీలోని విరూపాక్ష మండపం కప్పుపై అనేక చిత్రాలున్నాయి. అందులో విద్యారణ్యుడు పల్లకీలో వెళ్లడం, అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించడం, వటపత్రశాయి,

సీతా-రాముల కళ్యాణం మొదలైన కథా వస్తువులు మనకు దర్శనమి స్తాయి. లేపాక్షిలో వటపత్రశాయి, సీతారాముల అరణ్యవాసం, కిరా తార్జునీయం చిత్రాలు కనిపిస్తాయి. లేపాక్షి చిత్రాలలో చీరలు ధరిం చిన స్త్రీలు, ఆభరణాలు, వివిధ రకాల జుట్టుముడులు మనకు దర్శన మిస్తాయి. ఆనెగొందిలో రావణ సంహార ఘట్టాలు చిత్ర లేఖనంతో కనిపిస్తాయి. పిల్లల మర్రి చిత్ర కళలో మహమ్మ దీయుల ప్రభావం కొంత కనిపిస్తుంది. విజయనగర చిత్రలేఖనం సహజంగా ఉండి, తన ప్రత్యేకమైన శైలిని రూపొందించుకొని, తర్వాత కాలంలో వచ్చిన దక్కను చిత్ర కళకు స్ఫూర్తినిచ్చింది. విజయనగర రాజుల తర్వాత తంజావూరు నాయక రాజులు గోడలపై శైవ-వైష్ణవ-శాక్తేయ శాస్త్రాను సారం వివిధ చిత్రలేఖనాలను రూపొందించారు!!